# మచ్చ

వెదిరె సూక్ష్మ

13.10.2005

కౌసల్యా సుప్రజా రామ పూర్వా సంధ్యా ప్రవర్తతే.....' రేడియోలోంచి మంద్రంగా, మధురంగా వినిపిస్తుంది సుబ్బులక్ష్మి గాత్రం. మబ్బు తెరలు చీల్చుకుని అరుణవర్ణంతో తూర్పుదిక్కును వెలిగిస్తున్నాడు సూర్యుడు. పక్షుల కిలకిలారావాలు ప్రకృతికి సంగీతాన్ని అపాదిస్తున్నయి. పశువుల కాలిగిట్టల చప్పుళ్ళు మంజీరనాదంలా ధ్వనిస్తున్నాయి.

కోడి కూసింది. ఊరు మేల్కొంది .... ఊరితోపాటు ఆ ఇల్లూ మేల్కొంది. చుట్టూ ప్రహారీతో పెద్ద మండువాలోగిలి ఇల్లు అది. విశాలమైన అరుగు.ఇంటి ముందు బియ్యపు పిండితో వేసిన ముగ్గు సంప్రదాయానికి నిలువెత్తు నిదర్శనం.... సదాచారి... ఆ ఇంటి యజమాని. వయస్సు సుమారు అరువై ఏళ్ళుంటాయేమో. ఆప్రాంతంలో పేరుపొందిన జ్యోతిష్య శాస్త్రవేత్త. మామూలుగా చూస్తే ఆయనకు అరువై ఏళ్ళుంటాయని ఎవరికీ అనిపించదు. కానీ పూర్తిగా కాకున్నా అక్కడక్కడా ముడతలు పడిన శరీరం ఆయన వయసు ఇంతని చెప్తుంది. పాలభాగంపై విభూతిరేఖ తళుక్కున మెరుస్తోంది.

పూజ ముగించుకుని వరండాలోకి వచ్చాడు సదాచారి. ప్రతీరోజూ దినపత్రికలలోని వారఫలాలు చూడడం ఆయనకు అలవాటు. అప్రాంతంలో కొద్దోగోప్పో చదువుకున్నవాడు, మంచి పాండిత్యం కలిగినవాడు కావడంచేత ఆయనంటే అందరికీ ప్రత్యేకమైన గౌరవం. ఆయనకు దైవభక్తి ఎక్కువ. వయోభారంచేత కీళ్ళనొప్పులు మొదలయ్యాయి కొన్ని రోజునుంచి.

వరండాలో వాలుకుర్చీ 'ఈయన సేవకే నాజన్మ అంకితం' అన్నట్లు సదాచారి రాకకై ఎదురుచూస్తుంది. చేతిలోని పేపరును ఎదురుగ ఉన్న టీపాయ్ మీదపెట్టి వాలుకుర్చీలో కూలబడ్డాడు సదాచారి. కిర్రుమంటూ మూలిగింది వాలుకుర్చీ. కూర్చోడం కుదరక కాసేపు కిందికి పైకి జరిగాడు. లాభంలేదు... ఈసారి కూర్చోవడం కుదరలేదు, కాసేపు ఎడమకీ .... అటుపైన కుడికీ జరిగాడు. ఈసారి బాగానే కుదిరింది 'దీనికీ.... నాలాగే

వృద్ధాప్యం వస్తోంది...' మనసులోనే అనుకున్నాడు, తనమాటకు తనే ఓసారి చిన్నగా నవ్వుకున్నడు.

పేపర్లో వారఫలాలు చూడసాగాడు. దానిని చూస్తూ నొసలు ముడిబిగించి, కాసేపు ఆలోచించి ఆపైన సంతృప్తిగ అనిపించి చిన్నగా నవ్వుకున్నాడు. ఆయన నవ్వుకు నిన్నజరిగిన సంఘటన కూడా తోడయింది. 'తనకసలు ఉద్యోగప్రాప్తి ఉందో.... లేదో...చూడమంటూ వచ్చాడు ఒక యువకుడు. కుర్రవాడు బావున్నాడు. చదువుకూడా బాగానే ఉంది. కాసేపు జాతకచక్రం వేసి అటూ ఇటూ అన్నీ చూసి ఈ రోజు రమ్మని చెప్పాడు సదాచారి. 'పాపం ...... తను చెప్పే మాటకోసం అతను ఎంతో ఆదుర్దాతో వస్తాడు' మనసులో అనుకున్నాడు సదాచారి.

వంటింట్లో నుంచి పెద్దగా విజిల్ వినిపించింది. ఈరోజు టిఫిన్ ఇడ్లీ చేస్తోందో...... పొంగలేమైనా చేస్తోందో అనుకుంటూ 'అమ్మా! రత్నం .... ఒకసారి పొయ్యిమీద ఏముందో చూడమ్మా.....' గట్టిగా పిలిచాడు సదాచారి. రత్నం సదాచారి కూతురు. వయసు ఇరువై సంవత్సరాలు. టిఫిన్‌కి అంతా సిద్దంచేసి పొయ్యిమీద పెట్టి పెరట్లోకి వెళ్ళింది రత్నం. విరిసి విరియని గులాబీ మొగ్గలు..... విచ్చుకున్న మల్లెలు.....ఇంకా రకరకాల పువ్వులు సువాసనలు వెదజల్లుతూ పందిరంతా పూల మొక్కలతో ఆ పూలమొక్కల మధ్య తనుకూడా ఒకపూలతీగలా భాసిస్తోంది రత్నం.

తండ్రి కేకతో .... కోస్తున్న పూలను బుట్టలో పెట్టి వంటింట్లోకి పరిగెత్తింది రత్నం. మంజీరనాదం మనసుకు తాకింది సదాచారికి. వంటింట్లో మొదలైన ఉదయం సందడికి ఒక్కసారిగా చనిపోయిన భార్య గుర్తొచ్చింది. ఎంతో అన్యోన్యంగా గడిపారు భార్యాభర్తలిద్దరూ.

తను భార్యకంటే వయసులో పెద్దవాడైనా, సంప్రదాయ కుటుంబం, గౌరవం కలిగిన వంశమని శారదను తనకిచ్చి పెళ్ళిచేశారు. చిన్న పిల్లయినా ఎంతో మర్యాద మన్నన కలగలిసిన శారద తనజీవితంలో వెలుగులు నింపింది. కలకాలం కలసి జీవిస్తామని చేసుకున్న వాగ్దానం మర్చిపోయి, ప్రసవం కష్టమై చనిపోయింది శారద...తనను ఒంటరివాడిని చేసి. తల్లి పోలికలతో పుట్టింది రత్నం. ఘల్లుఘల్లుమని నట్టింట్లో రత్నం

తిరుగుతుంటే.... చనిపోయన భార్యే గుర్తొచ్చింది. ఆమె జ్ఞాపకాలతో మనసు ఆర్ద్రమయింది. కళ్ళల్లో చిన్న కన్నీటి తెర అడ్డుపడి.... కళ్ళు మసకగా అయ్యాయి.కళ్ళజోడు తీసి తుడుచుకుని మళ్ళీ పెట్టుకున్నాడు సదాచారి.

'నాన్నా ..... కాఫీ ......!' వేడివేడి కాఫీ చేతికి అందించి పూలకుండీల పనిచూడసాగింది. కుండీలు శుభ్రం చేసి అవసరమైన వాటికి నీళ్ళుపోస్తూ ఆపనిలో నిమగ్నమైపోయింది రత్నం. పొగలు కక్కుతోంది....... వేడివేడి కాఫీ. సువాసన ముక్కుపుటాలను సోకింది. గట్టిగా వాసన పీల్చుకుని....... ఒక్కొక్క గుటకా తాగసాగాడు కాఫీ. ఒక్కోగుటక లోపలికి పోగానే సదాచారి నరనరాలలో కొత్త ఉత్తేజం నిండింది.

ఫ్లవర్‌వాజ్‌లో పువ్వులు సర్దుతున్న కూతుర్ని గమనించాడు సదాచారి. ఏవో కొత్త సిగ్గులు ప్రవేశించాయి అతనిలో. అమె సౌందర్యం మొదటిసారి గమనించిన సదాచారి ఒక్క నిమిషం తొట్రుపడ్డాడు. అల్లిన జడనుండి విడిపడిన వెంట్రుకలు గాలికి కదులుతుండగా....... దొండపండులాంటి ఎర్రని పెదవుల నుండి ముత్యాలు రాలినట్లుగా సన్నగా నవ్వింది రత్నం. ముత్యాలు పేర్చినట్టున్న పలువరస తళుక్కున మెరిసింది. నింగినుండి నేలకు దిగిన చంద్రబింబంలా...... కోమలమైన తీగెవంటి ఆమె శరీరం లేయెండకాస్తున్న తూర్పుదిక్కులాగా వెలిగిపోతుంది. ఉన్నతమైన నాసిక .... తామరపువ్వుల్లాంటి కళ్ళు...... నవ్వితే మెరిసే పళ్ళు.... చూస్తున్న కొద్దీ సదాచారిలో ఉత్సాహం అధికం కాసాగింది.

అకస్మాత్తుగ అతని వయస్సు వెనక్కి జరిగింది. యవ్వనంలో....... పాతికేళ్ళ యువకుని ఆలోచనా పరంపరలో పడి కొట్టుకుపోతోంది మనసు. కూతురిలో తన భార్యనే చూడసాగడు. ఒక్క క్షణం స్త్రీ పట్ల ఆకర్షణకు గురయ్యాడు. మనసు వశం తప్పుతోంది. ఆ నిమిషంలో అతను జ్యోతిష్య శాస్త్రవేత్త కాదు...అలాగని తండ్రి కూడాకాడు. యవ్వనం ఉరకలేసే నవయువకుడు. చూస్తూ ఉండాగానే ఆలోచనలు శృతిమించి....... ఉద్రేకంతోపాటు ఉద్వేగం పెరిగింది. ఆమెను తాకాలనిపించింది.

చటుక్కున లేచాడు కుర్చీలోంచి. బరువు దిగిపోయినందుకు హయిగా వున్నా ఉన్నచోటునుంచి కదలడం వల్లనేమో వాలుకుర్చీకి చిన్న ప్రకంపనలు పుట్టి ఊగసాగింది.

తెగీ తెగని ఆలోచనలు...... తడబడే అడుగులు...... మెల్లగా చేరి రత్నం వెనుక నిలబడ్డాడు సదాచారి. శరీరం నుండి చందనం వాసన.... భార్యతాలూకా జ్ఞాపకాలు అతనిలో కోరికలను మరింత పెంచాయి ఆక్షణం. మనసు స్వాధీనంలో లేదు. ఆహ్వానం పలికినట్లున్న సన్నని భుజాలు..... అతన్ని మరింత ఉక్కిరిబిక్కిరి చేయడంతో....... తట్టుకోలేక భుజాలు అందుకుందామని చేయిచాచాడు.

'ట్రింగ్.... ట్రింగ్.......ట్రింగ్.....' ఒక్కసారిగా కాలింగ్‌బెల్ మోగడంతో ఉలిక్కిపడ్డాడు. అప్పటివరకూ ఊహాలోకంలో విహరించిన మనస్సు.... ఒక్కసారిగా తేరుకొని వాస్తవంలోకి వచ్చాడు సదాచారి.

ఏ భావాలూ లేని రత్నం.....తలుపు తెరవాలని వెనుదిరిగింది. అదోరకం చూపులతో వెనక నిలబడ్డ తండ్రిని అదోలా చూసింది. కనురెప్పల నుండి సిగ్గుజారి బుగ్గలపై పడి మెరిశాయి. చిన్నగా నవ్వుకుంటూ వెళ్ళి తలుపు తీసింది. రాకూడని ఆలోచనలు కలగడంతో తప్పు చేశానన్న భావంతో సిగ్గుతో తడబడుతూ, తత్తరపాటుతో మళ్ళీ వాలుకుర్చీలో కూలబడ్డాడు..... వాలుకుర్చీ వెక్కిరిస్తూ మూలిగింది. వరండాలోకి వస్తున్న యువకుణ్ణి చూడడంతో ఎక్కడలేని సిగ్గూ కలిగింది సదాచారికి. అందరికీ జాతకం చెప్పే తనకు ఈ పిచ్చిపిచ్చి ఆలోచనలేంటో......... అర్థం కాలేదు సదాచారికి. 'రత్నానికి వెంటనే పెళ్ళి చేసెయ్యాలి అనుకుంటూ గట్టిగా నిట్టూర్చాడు.